సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం ၊ 11 ၊ జూన్ ၊ 2025



తొలకరి పలకరించే వేళ..
తొలకరి పలకరింపుతో పాటు నేడు ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. 8లో



అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు
అనుమతి లేకుండా మిర్చి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
35° / 26°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పలుచోట్ల వాతావరణం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

జ్యేష్ఠాభిషేకానికి అంకురార్పణ



నదీ జలాన్ని తీసుకొస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో బుధవారం జరగనున్న జ్యేష్ఠాభిషేకానికి మంగళవారం అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పవిత్ర గోదావరి నుంచి అర్చకులు తీర్థబిందె తీసుకొచ్చారు. జ్యేష్ఠ పౌర్ణమి (ఏరువాక పౌర్ణమి)ని పురస్కరించుకుని రామాలయంలో ప్రతీ ఏటా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు తెలిపారు. బేడా మండపంలో 81 కలశాలలో సమస్త నదీ జలాలను ఆవాహన చేసి స్వామివారికి అభిషేకం చేస్తామని, ఈ సందర్భంగా నిత్యకల్యాణం రద్దు చేశామని వివరించారు.

ఆరో బెటాలియన్‌ను సందర్శించిన ఎస్పీ



పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఆరో బెటాలియన్‌ను ఎస్పీ రోహిత్‌రాజు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లోని స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ వారి ఆధునాతన పరికరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎలాంటి విపత్తులు, ప్రమాదాలు ఎదురైనా ఎస్‌డీఆర్ఎఫ్ బృందం తక్షణమే స్పందించి ప్రజలను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ



మొక్కలను వ్యాన్‌లో లోడ్ చేస్తున్న కూలీలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం ఆయిల్‌ఫెడ్ డివిజన్ నర్సరీ నుంచి రైతులకు మంగళవారం ఆయిల్‌పామ్ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ నాయుడు రాధాకృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలో 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి 9,500 ఎకరాలకు సరిపడా మొక్కలు పంపిణీ చేయాలనేది లక్ష్యం కాగా, అంతకు మించి 9,556 ఎకరాలకు పంపిణీ చేశామని తెలిపారు. 2025 – 26 ఆర్థిక సంవత్సరంలో 11,500 ఎకరాలకు మొక్కల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు 500 ఎకరాలకు అందించామని వివరించారు. దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ సరిపడా మొక్కలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

బూర్గంపాడు హాస్పిటల్‌లో నలుగురు డెంటిస్ట్‌లు

- వారితోనే అన్ని వ్యాధులకూ చికిత్స
- రెగ్యులర్ వైద్యులు లేక ఇక్కట్లు
- తక్షణమే నియమించాలని ప్రజల వేడుకోలు

బూర్గంపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్



సీహెచ్‌సీనా... డెంటల్ ఆస్పత్రా !

నిత్యం 100 మందికి పైగా ఔట్ పేషెంట్లు, సుమారు 30 మంది ఇన్ పేషెంట్లు చికిత్స పొందుతున్న బూర్గంపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. వర్షాకాలం ప్రారంభమైతే పేషెంట్ల సంఖ్య రెట్టింపవుతుంది. వాస్తవానికి ఈ సీహెచ్‌సీలో 13 మంది డాక్టర్లు ఉండాలి. కానీ ఇక్కడ ఒక్కరు కూడా రెగ్యులర్ వైద్యులు లేరు. ఆస్పత్రి సూపరింటెండెంట్ పిల్లల వైద్య నిపుణులు కాగా, మిగితా నలుగురు డెంటిస్ట్‌లు. వీరంతా డిప్యూటేషన్‌పై ఇక్కడ పనిచేస్తున్న వారే కావడం గమనార్హం. ఇక 'నలుగురు డెంటిస్ట్‌లు ఉన్నారు.. ఇక్కడ దంత వైద్య సేవలు బాగా అందుతాయి' అనుకుంటే పొరపాటే. ఈ ఆస్పత్రిలో అలాంటి చికిత్సలే లేకపోగా నిత్యం వచ్చే ఇన్, ఔట్ పేషెంట్లకు వీరే జనరల్ వైద్య సేవలు అందిస్తున్నారు.

– బూర్గంపాడు



చికిత్స పొందుతున్న పేషెంట్లు

స్పెషలిస్టులు లేరు..

బూర్గంపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో ఎంబీబీఎస్, ఎంఎస్, ఎండీ, గైనకాలజిస్ట్, అనస్తీషియన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్ వంటి నిపుణులైన వైద్యులు ఉండాలి. కానీ ఇక్కడ కనీసం ఎంబీబీఎస్ డాక్టర్లు కూడా లేరు. 30 పడకల ఈ ఆస్పత్రికి ఏ జబ్బు చేసిన వారొచ్చినా డెంటిస్ట్‌లే దిక్కు. అసలే అరకొర వసతులు.. దానికి తోడు వైద్యులు లేకపోవడంతో పేషెంట్లు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కేవలం జ్వరం, జలుబు, దగ్గు వంటి చిన్న చిన్న వ్యాధులకే చికిత్స అందుతోంది.

కలెక్టర్ ఆదేశించినా..

కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఇటీవల ఈ ఆస్పత్రిని తనిఖీ చేసి వైద్యులు, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీహెచ్‌సీలో ప్రసవాలు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. డెలివరీలు జరిగేలా చూడాలని ఆదేశించారు. అయితే ఇక్కడ గైనకాలజిస్ట్, అనస్తీషియన్ లేకపోవడంతో ప్రసవాలు చేయడం సాధ్యం కాదనే చర్చ సాగుతోంది. ఆపరేషన్ థియేటర్ కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేదు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇటీవలే కొన్ని వసతులు సమకూర్చారు. గతంలో ఇక్కడున్న దంతవైద్య పరికరాలు, పడకలను ఇతర ఆస్పత్రులకు తరలించారనే ఆరోపణలున్నాయి. ఆక్సిజన్ ప్లాంట్ కూడా పని చేయడం లేదు. కలెక్టర్ తనిఖీ అనంతరం ఇక్కడున్న నలుగురు డెంటిస్ట్‌ల్లో ఒకరిని జూలూరుపాడుకు పంపించి ఆ స్థానంలో ఓ ఎంబీబీఎస్‌ను డిప్యూటేషన్‌పై నియమించారు. ఇక్కడ వసతులతో పాటు వైద్య నిపుణులను నియమిస్తే సేవలు మెరుగుపడే అవకాశాలున్నాయి. రూ 2.70 కోట్లతో నూతన భవనాలను నిర్మిస్తుండగా ఆరు నెలల్లో అవి అందుబాటులోకి రానున్నాయి. ఈ సీహెచ్‌సీకి బూర్గంపాడు, ములకలపల్లి మండలాలతో పాటు ఏపీలో విలీనమైన పలు గ్రామాలు, కుక్కునూరు మండలం నుంచి ఎక్కువగా వస్తుంటారు. ఇకనైనా అధికారులు స్పందించి వైద్య నిపుణులను నియమించి సేవలు మెరుగుపడేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

2020లో అప్‌గ్రేడ్.

గతంలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధీనంలో ఉన్న బూర్గంపాడు సివిల్ ఆస్పత్రిని 2020లో వైద్య విధాన పరిషత్ పరిధిలోకి తీసుకొచ్చారు. 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. ఆ సమయంలో డిప్యూటేషన్‌పై గైనకాలజిస్ట్, అనస్తీషియన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్ వైద్యులను నియమించారు. మూడు నెలలు తిరగకుండానే వీరంతా డిప్యూటేషన్ రద్దు చేయించుకున్నారు. అప్పటి నుంచి డెంటిస్ట్‌లతోనే నెట్టుకొస్తున్నారు. వైద్యవిధాన పరిషత్ పరిధిలోకి వచ్చినా కనీసం ఎంబీబీఎస్ డాక్టర్‌ను కూడా నియమించ లేదనే విమర్శలున్నాయి. సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ అయ్యాక పేషెంట్లకు భోజన వసతి మాత్రం కల్పిస్తున్నారు. ఈ సీహెచ్‌సీలో 12 మంది స్టాఫ్ నర్సులకు గాను ప్రస్తుతం ఎనిమిది మంది మాత్రమే ఉన్నారు. 24 గంటలూ నిరంతర వైద్య సేవలు అందించాల్సి ఉండగా వైద్యుల కొరతతో సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి.

వైద్య సేవలు మెరుగుపరుస్తాం

బూర్గంపాడు సీహెచ్‌సీలో వైద్యసేవలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవలే ఓ ఎంబీబీఎస్ డాక్టర్ వచ్చారు. మరికొందరు నిపుణులను కూడా నియమించేలా వైద్య విధాన పరిషత్ చర్యలు తీసుకుంటోంది. నూతన భవనాలు అందుబాటులోకి వచ్చేసరికి డాక్టర్లు కూడా వచ్చే అవకాశం ఉంది.

– డాక్టర్ ముక్కంటేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్

రైతులకు భరోసా కల్పించేందుకే 'భూ భారతి'

అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కరకగూడెం: దీర్ఘకాలిక భూ సమస్యలు పరిష్కరించడంతో పాటు రైతులకు భరోసా కల్పించేందుకే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన కరకగూడెం మండలం మోతెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. అంతేకాక గతంలో రిజిస్ట్రేషన్ లేని సాదా బైనామాలను క్రమబద్ధీకరించడం, వారసత్వ భూముల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. భూ రికార్డుల్లో తప్పుల సవరణ, మ్యుటేషన్ సమస్యలు పరిష్కరించేందుకు తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలో అప్పీల్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాము 60 ఏళ్లుగా అసైన్డ్ భూములు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, పట్టాలు ఇప్పించి హక్కులు కల్పించాలని గ్రామస్తులు కోరగా.. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, తహసీల్దార్ వట్టం కాంతయ్య, ఆర్ఐ కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కరకగూడెం: రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం

పినపాక: ఇందిరమ్మ ఇళ్లు పేదల పాలిట వరమని, ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన పినపాక మండలంలో పర్యటించి నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ ఇంటికి జియో ట్యాగింగ్ ఏర్పాటు చేశామని, అవకతవకలు, అక్రమాలకు తావు ఉండదని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, ఏఈ వినీత, ఎంపీడీఓ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

రేపు దిశ కమిటీ సమావేశం

చుంచుపల్లి: ఈ నెల 12న మధ్యాహ్నం 3 గంటలకు ఐడీఓసీలో దిశ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దిశ కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

ఐటీడీఏ పీఓ రాహుల్ వెల్లడి



టెండర్‌దారులకు సూచనలు చేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలంఅర్బన్ : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. 50 ఆశ్రమ పాఠశాలలు, 14 వసతి గృహాలు, 22 పీఎంహెచ్ హాస్టళ్లకు కూరగాయలు, పండ్లు, చికెన్, కోడిగుడ్లు సరఫరా చేసే ఏజెన్సీల సమక్షంలో ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం టెండర్ బాక్స్‌లు తెరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దాదాపు 40 మంది ఏజెన్సీదారులు టెండర్లు దాఖలు చేశారని, తక్కువ ధర కోట్ చేసిన వారినే ఆమోదించామని తెలిపారు. అనంతరం టెండర్‌దారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూ ప్రకారమే సరుకులు సరఫరా చేయాలని, వారం మొత్తానికి ఒకేసారి కాకుండా మూడుసార్లు అందించాలని సూచించారు. వారానికి ఐదు రోజులు అరటి పండ్లు, రెండు రోజులు ఇతర పండ్లు పంపిణీ చేయాలన్నారు. నాసిరకమైన సరుకులు సరఫరా చేసినట్లు ఫిర్యాదు అందితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని, తమ పరిధిలోని విద్యాసంస్థల్లో మూడేళ్ల పాటు టెండర్ దాఖలు చేయకుండా బ్లాక్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఈఈ హరీష్, ఏసీఎంఓ రమేష్, ఏటీడీఓలు అశోక్ కుమార్, రాధమ్మ, హెచ్‌ఎంలు నరసింహారావు, సావిత్రి, వార్డెన్లు లక్ష్మి, నాగరాజు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో బడులు ప్రారంభించాలి

అదనపు కలెక్టర్ విద్యాచందన



మాట్లాడుతున్న విద్యాచందన, పక్కన డీఈఓ తదితరులు

చుంచుపల్లి: ఈనెల 12న పండుగ వాతావరణంలో బడులు ప్రారంభించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎం.విద్యా చందన అన్నారు. మంగళవారం ఆమె డీఆర్డీఏ కార్యాలయం నుంచి ఎంపీడీఓలు, ఎంఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలు పునః ప్రారంభం కాబోతున్నందున సుందరంగా తీర్చిదిద్దాలని, మామిడి తోరణాలతో అలంకరించాలని సూచించారు. పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫామ్ అందించాలని చెప్పారు. బడిబాట షెడ్యూల్ ప్రకారం ఇంటింటికీ వెళ్లి బడీడు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, బోధన వంటి విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాన్ని బట్టి ప్రతి పాఠశాలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీఈఓ వెంకటేశ్వరా చారి మాట్లాడుతూ.. పాఠశాలలు 12న ప్రారంభమవుతున్న సందర్భంగా ఆవరణలోని పిచ్చి మొక్కలు, పొదలు శుభ్రం చేసి విషపురుగులు లేకుండా చూడాలన్నారు. తరగతి గదులను శుభ్రం చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ల సహకారంతో ఐదేళ్లు నిండిన పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలని సూచించారు. వీసీలో అడిషనల్ డీఆర్డీఓ (సెర్ప్) నీలేష్, జిల్లా విద్యాశాఖ కో–ఆర్డినేటర్లు ఎస్‌కే సైదులు, ఎన్.సతీష్‌కుమార్, డీపీఎంలు రంగారావు, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్



మందులను పరిశీలిస్తున్న భాస్కర్‌నాయక్

ఇల్లెందురూరల్ : వర్షాకాలం ప్రారంభంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి భాస్కర్‌నాయక్ సూచించారు. మండలంలోని రొంపేడు పీహెచ్‌సీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మందుల నిల్వలను పరిశీలించి రోజువారీ ఓపీ, ఐపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. గర్భిణులను క్రమం తప్పకుండా పరీక్షించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని అన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి, రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి కవిత తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌బడి'కి అడుగులు

- అడ్మిషన్ల ప్రక్రియ షురూ..
- ప్రారంభమైన అమ్మ మాట – అంగన్‌వాడీ బాట
- రెండున్నరేళ్లు పైబడిన చిన్నారులను చేర్చడమే లక్ష్యం
- ఈనెల 17 వరకు ప్రత్యేక కార్యక్రమాలు



భద్రాచలంలో అమ్మమాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో ఉద్యోగులు

భద్రాచలంఅర్బన్ : చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలకం. వారు పాఠశాలల్లో చేరే నాటికి అక్షరాలు, అంకెలు నేర్చి ఆటపాటలతో కూడిన విద్య అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం.. మంగళవారం నుంచి ఈనెల 17 వరకు 'అమ్మమాట – అంగన్‌వాడీ బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 30 నెలలు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో 17వ తేదీన సామూహిక అక్షరాభ్యాసాలు చేయించనున్నారు.

మానసిక ఒత్తిడికి లోనుకాకుండా..

ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్య అందిస్తున్నారు. పిల్లలపై మానసిక ఒత్తిడి పడకుండా ఆటలు, పాటలు, కథల ద్వారా చదువుపై ఆసక్తి పెంచుతున్నారు. వారిని ఆకట్టుకునేలా సిలబస్ రూపొందించారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు గతేడాది నుంచి ప్రభుత్వం యూనిఫామ్ కూడా అందిస్తున్న విషయం తెలిసిందే.

బడిబాట పట్టేలా..

జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,061 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 7 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 30,654 మంది, 3 – 6 ఏళ్ల మధ్య వారు 26,635 మంది ఉన్నారు. వీరితో పాటు 6,429 మంది గర్భిణులు, 5,825 మంది బాలింతలు ఉన్నారు. ఐదేళ్లు నిండిన వారిని పాఠశాలల్లో చేర్పిస్తే ఈ సెంటర్లలో చిన్నారుల సంఖ్య తగ్గుతుంది. దీంతో మూడేళ్లు దాటిన పిల్లలు ఎక్కడెక్కడ ఉన్నారో గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకొచ్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సెంటర్లలో చిన్నారులకు భోజనం, గుడ్లు, మురుకులు అందజేస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్నారు. మూడు నుంచి ఆరేళ్ల చిన్నారులను బడిబాట పట్టించేందుకు సిద్ధం చేస్తున్నారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా భావించేవారు. పిల్లలకు పాఠశాల వాతావరణం అలవాటు చేయడంతో పాటు పౌష్టికాహారం అందించి, ఆటలు ఆడించి, బడి అంటే భయం పోగొట్టే కేంద్రాలు అనుకునేవారు. అయితే గతేడాది నుంచి పౌష్టికాహారం, ఆటపాటలతో పాటు చిన్నారులకు విజ్ఞానం అందించేందుకు వర్క్‌బుక్‌లు ఇస్తూ హోంవర్క్ చేయిస్తున్నారు. ఎల్‌కేజీ వారికి తంగేడు పువ్వు పేరుతో నాలుగు పుస్తకాలు, యూకేజీ వారికి పాలపిట్ట పేరిట ఐదు పుస్తకాలు బోధిస్తున్నారు. ప్రస్తుతం నిపుణ్ భారత్ ద్వారా వచ్చిన ప్రియదర్శిని పుస్తకంతో సులభ పద్ధతుల్లో విద్యా బోధన చేస్తున్నారు.

ఖాళీలతో సతమతం

జిల్లాలో 2,061 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను ప్రస్తుతం 192 టీచర్, 961 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పక్క కేంద్రాలకు చెందిన టీచర్లు, ఆయాలతోనే నిర్వహిస్తుండగా రెండు కేంద్రాల పర్యవేక్షణ వారికి భారంగా మారుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి చర్యలు చేపడుతున్న ప్రభుత్వం.. ఖాళీలను కూడా భర్తీ చేస్తే చిన్నారుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని పలువురు చెబుతున్నారు.

17 వరకు కార్యక్రమాలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 17 వరకు 'అమ్మ మాట – అంగన్‌వాడీ బాట' కార్యక్రమం నిర్వహిస్తున్నాం. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు అలవాటు చేసి ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య అందించడమే కార్యక్రమ లక్ష్యం. విజయవంతానికి ప్రతీ అంగన్‌వాడీ టీచర్, ఆయా కృషి చేయాలి.

– జ్యోతి, సీడీపీఓ, దుమ్ముగూడెం ప్రాజెక్ట్

చిన్నారులను చేర్పించేలా..



జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్లు దాటిన చిన్నారులను చేర్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఐదేళ్లు దాటిన చిన్నారులను దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడంతో పాటు వారికి అందించే పౌష్టికాహారం, పూర్వ ప్రాథమిక విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాల నిర్వహణ ఉంటుంది.

– స్వర్ణలత లెనీనా, జిల్లా సంక్షేమాధికారి

ప్రశ్నించే కమ్యూనిస్టులపై కేంద్రం కక్ష కట్టింది..

- మోడీ నియంత పాలనకు ఆపరేషన్ కగారే నిదర్శనం
- నంబాల మృతిపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

పాల్వంచరూరల్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్‌షా నియంత పాలన సాగిస్తూ ప్రశ్నించే కమ్యూనిస్టులపై కక్షకట్టారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారని అన్నారు. మండల పరిధిలోని పాండురంగాపురంలో మంగళవారం నిర్వహించిన సీపీఐ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందుకు కేంద్రం ముందుకు రాకుంటే సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలని కోరారు. ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న వారిని ఎన్‌కౌంటర్లు చేయడం సమంజసం కాదన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినా పట్టించుకోకుండా ఉద్దేశ పూర్వకంగానే ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. మావోయిస్టులు కూడా తమ లైన్ మార్చుకోవాలని, ప్రజల మద్దతు లేకుండా ఎన్ని త్యాగాలు చేసినా వృథానేనని అన్నారు. 1952లో తాము కూడా అజ్ఞాతంలో ఉండి పోరాటాలు చేశామని, ఆ తర్వాత పంథా మార్చుకుని ప్రజాస్వామ్యయుతంగా పోరాడుతున్నామని వివరించారు. కమ్యూనిస్టులంతా ఐక్యంగా ఉంటే ఎర్రకోటపై ఎర్రజెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పేద ప్రజలకు ఎర్రజెండా ఒక్కటే భరోసా అన్నారు. కాగా, తన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయించాలని ఓటమి పాలైన కొందరు కుట్ర పన్నినా.. అంతిమంగా న్యాయమే గెలిచిందని వ్యాఖ్యానించారు. సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబిర్‌పాషా, నాయకులు నిమ్మల రాంబాబు, అప్పారావు, నాగరాజు, ముత్యాల విశ్వనాథం, పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, అడుసుమల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, పద్మజ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంఅర్బన్: రాష్ట్రంలోని రెండు గిరిజన గురుకుల జూనియర్(పీవీటీజీ ఆదిమ గిరిజన తెగలు) కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. హైదరాబాద్ హయత్‌నగర్‌లో పీవీటీజీ–సీఓఈ(బాలురు, బాలికలు) గురుకులాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కొండరెడ్డి, చెంచు, కొలం, తోటి, కోలావర్ తెగకు చెంది 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సీటు లభించిన వారికి ఉచిత బోధన, భోజనంతో పాటు పాఠ్య, నోట్‌పుస్తకాలు, యూనిఫామ్, నైట్ డ్రెస్సులు, స్పోర్ట్స్ డ్రెస్సులు, షూస్‌తో పాటు కాస్మోటిక్ చార్జీలు చెల్లిస్తారని పేర్కొన్నారు. అంతేకాక జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్, ఎప్‌సెట్, లాసెట్, సీయూ సెట్శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఖమ్మం రీజియన్ ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో ఈనెల 16లోగా దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 99497 23291, 94403 98993, 83099 31449 నంబర్లలో సంప్రదించాలని పీఓ సూచించారు.

1.92 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత



పట్టుకున్న నల్లబెల్లం, నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మేదరబస్తీకి చెందిన దివాకర్ రాజు నాటుసారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, పటిక అమ్ముతున్నాడనే సమాచారం మేరకు కొత్తగూడెం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీం మంగళవారం అతడి ఇంట్లో తనిఖీలు చేపట్టింది. ఈ క్రమంలో 1.92 క్వింటాళ్ల నల్లబెల్లం, ఐదు కేజీల పటిక పట్టుకున్నామని ఎక్సైజ్ ఎస్‌ఈ కరమ్‌చంద్ తెలిపారు. దివాకర్‌రాజు కొంతకాలంగా నాటుసారా తయారీదారులకు నల్లబెల్లం, పటిక అమ్ముతున్నాడని, ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేశామని చెప్పారు. తనిఖీల్లో డీటీఎఫ్ ఎస్సై గౌతమ్, సిబ్బంది రామకృష్ణ గౌడ్, హబీబ్ పాషా, గురవయ్య, వెంకటనారాయణ, శ్రావణి, పార్థసారధి పాల్గొన్నారు.

సింగరేణి కళాశాలలో మూడు కొత్తకోర్సులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 2025 – 26 విద్యా సంవత్సరానికి డిగ్రీలో మూడు కొత్త కోర్సులను ప్రవేశ పెడుతున్నట్లు సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ డేటా సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), బీఏ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి ఉద్యోగుల కుమార్తెలు ఈ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా కళాశాలలో అద్భుతమైన భోదన, పూర్తి సెక్యూరిటీతో హాస్టల్ నిర్వహణ ఉండడమే కాక నేటి డేటా ఆధారిత ప్రపంచంలో విశ్లేషణాత్మక నైపుణ్యాలు,సమస్య పరిష్కార సామర్థ్యాలు, కేరీర్ అవకాశాలు మెరుగు పడతాయని వెల్లడించారు.

కుమారుడి కళ్లెదుటే తండ్రి మృతి



హరికృష్ణ (ఫైల్)

నేలకొండపల్లి: ఈత కొట్టేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో మునగగా కుమారుడి కళ్లెదుటే మృతి చెందాడు. మండలంలోని రాజేశ్వరపురానికి చెందిన రెడ్డబోయిన హరికృష్ణ(32) తనకుమారుడు శివరామ్ ను తీసుకుని మంగళవారం గ్రామంలోని వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. తొలుత హరికృష్ణ బావిలో దూకగా, కుమారుడిని కూడా రమ్మన్నాడు. కానీ కుమారుడు భయంతో గట్టుపైనే ఉండగా ఈత కొడుతు న్న హరికృష్ణ కాసేపటికి నీటమునిగి మృతిచెందాడు. శివరామ్ ఇచ్చిన సమాచారంతో కుటుంబీకులు, స్థానికులు చేరుకుని ఆయన మృతదేహాన్ని బయటకు తీశారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

జూలూరుపాడు: మండలంలోని భేతాళపాడు గ్రామ పంచాయతీ రాచబండ్ల కోయగూడెం గ్రామంలో మంగళవారం విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందింది. గ్రామంలోని వర్సా చంద్రయ్య అనే రైతుకు చెందిన దుక్కిటెద్దు మేత కోసం పొలాలకు వెళ్లగా అక్కడున్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని చంద్రయ్య విజ్ఞప్తి చేశాడు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.18,748

తొలకరి పలకరించే వేళ..

- పులకించనున్న పుడమితల్లి
- రైతు మోమున వెల్లివిరియనున్న ఆనందం
- సాగుకు అన్నదాత సన్నద్ధం
- నేడు ఏరువాక పౌర్ణమి



నాగలితో దుక్కి దున్నుతున్న రైతు

ఇల్లెందురూరల్: తొలకరి పలకరింపుతో రైతులు వ్యవసాయ పనులకు ముందడుగు వేస్తున్నారు. ఆధునికత ఎంత పెరిగినా తొలకరి వేళ నాగళ్లతోనే దున్నేందుకు ఆసక్తి చూపుతారు. జిల్లా వ్యాప్తంగా సాగుకు సన్నద్ధమైన రైతులు.. బుధవారం ఏరువాకపౌర్ణమి పండుగను సంప్రదాయ పద్ధతులతో జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

సంప్రదాయ వేడుక..

ఏరు అంటే దున్నడానికి సిద్ధం చేసిన నాగలి అని, ఏరువాక అంటే తొలిసారి పొలం దున్నడమని అర్థం. వ్యవసాయ పనుల ప్రారంభానికి సూచికగా రైతులు ఏరువాక పౌర్ణమిని జరుపుకుంటారు. ఈ రోజున మొదట నాగలితో దుక్కిదున్ని భూమి పూజ చేస్తారు. తద్వారా పంటలు బాగా పండుతాయని, తమ కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని రైతుల విశ్వాసం.

సమష్టి సాగుకు దిక్సూచి..

వైశాఖ మాసం ముగిసి జ్యేష్ఠ మాసం వచ్చాక చిరుజల్లులు కురుస్తుంటాయి. భూమి కొంత మేర పదును ఎక్కాక నాగలితో దున్నేందుకు అనువుగా ఉంటుంది. అందుకే రైతులంతా సమష్టిగా వ్యవసాయ పనుల ప్రారంభానికి ఏరువాక పౌర్ణమిని ఎంచుకుంటారు. కొంతమంది అంతకుముందే మొదలుపెట్టినా.. అలా చేస్తే ఫలితాలు తారుమారు అవుతాయని ఎక్కువ మంది రైతులు నమ్ముతుంటారు.

పనిముట్లు, పశుసంపదకు పూజ..

ఏరువాక పౌర్ణమి రోజున వ్యవసాయ పనిముట్లను కడిగి శుభ్రం చేసుకుంటారు. పశువులకు కూడా శుభ్రంగా స్నానం చేయించి వస్తువులకు, ఎద్దులకు పసుపు, కుంకుమ చల్లుతారు. కాళ్లకు గజ్జలు అలంకరించి హారతులిస్తారు. మేళతాళాలతో ఊరేగిస్తారు. అనంతరం శ్రేష్ఠమైన ఆహారాన్ని ప్రసాదంగా చేసి ఎద్దులకు తినిపిస్తారు. తమ ఇష్ట దైవాలకు సైతం పూజలు చేశాక పొలానికి వెళ్లి దుక్కులు దున్నడం ప్రారంభిస్తారు.

సంప్రదాయం కనుమరుగవుతోంది



వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ముందు రైతులు భూమిపూజ చేయడం, సాగుకు అవసరమైన ఎద్దులు, పని ముట్లను పూజించడం అనాది గా వస్తున్న ఆచారం. అయితే ప్రస్తుత రోజుల్లో వర్షం కురిసిన వేళ విత్తనాలు వేయడం మినహా రైతులు సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పాటించడం లేదు.

–ధనియాకుల బాబు,చల్లసముద్రం,ఇల్లెందుమండలం

పండుగను విస్మరిస్తున్నారు..



తొలకరి పలకరించిన వేళ వ్యవసాయం సంబురంగా సాగాలని రెతులు జరుపుకునే పండుగే ఏరువాక పౌర్ణమి. తరతరాల సంప్రదాయాన్ని ప్రోత్సహించాల్సిన పాలకులు సైతం ఆ వేడుకను విస్మరిస్తున్నారు. రైతులకు కనీసం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

– చింత రామ్మూర్తి,అన్నారం, ఇల్లెందు మండలం

అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు

- కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హెచ్చరిక
- రూ. 1.09 లక్షల విలువైన మిర్చి విత్తనాల పట్టివేత



నకిలీ విత్తనాలు అమ్ముతూ పట్టుబడిన వారితో డీఎస్పీ, తదితరులు

జూలూరుపాడు: ప్రభుత్వ అనుమతి లేకుండా మిర్చి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. స్థానిక సీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలూరుపాడు మండలం అనంతారంలో ఎలాంటి అనుమతి లేకుండా ఇద్దరు వ్యక్తులు రైతులకు మిర్చి విత్తనాలు విక్రయిస్తున్నట్లు స్థానిక వ్యవసాయ అధికారి దీపక్ ఆనంద్‌కు సమాచారం అందిందని, దీంతో ఆయనతో పాటు కాకర్ల ఏఈఓ జె.వి.డి ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ వెంకటరత్నం, కానిస్టేబుల్ వెంకటేశ్వరరావుతో కూడిన బృందం ఆ గ్రామానికి వెళ్లి తనిఖీ నిర్వహించిందని తెలిపారు. ఇద్దరు వ్యక్తులు ఓ రైతుకు మిర్చి విత్తనాలు అమ్ముతుండగా పట్టుకున్నారని, వారిని అదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ చెప్పారు. వారి నుంచి రూ. 1.09 లక్షల విలువైన 115 విత్తన ప్యాకెట్లు, క్రేటా కారు, రూ.13,000, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆ ఇద్దరిలో ఒకరు ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పెద్ద కోరుకొండికి చెందిన నున్నా మహేష్ ఏపీలోని గుటూరు జిల్లాలో జనతా సీడ్స్ మార్కెటింగ్ మేనేజర్‌గా పని చేస్తున్నాడని, మరో వ్యక్తి ఏన్కూర్‌మండలం జన్నారం గ్రామానికి చెందిన పల్లపు తిరుపతిరావుగా విచారణలో తెలిసిందని వెల్లడించారు. వారిద్దరూ గుంటూరు జిల్లాలో జనతా సీడ్స్ షాపు వద్ద ప్రజ్వల్ సీడ్స్, కావ్య సీడ్స్ మిర్చి విత్తనాలను ఒక ప్యాకెట్ ధర రూ 600 చొప్పున కొనుగోలు చేసి రైతులకు రూ. 950 చొప్పున విక్రయిస్తున్నారని చెప్పారు. ఇద్దరినీ అరెస్ట్ చేయగా నేరం అంగీకరించారని, రిమాండ్ నిమిత్తం కొత్తగూడెం కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ బాదావత్ రవి, పోలీస్ సిబ్బందితోపాటు, వ్యవసాయ అధికారులను డీఎస్పీ అభినందించారు. జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు, మందులను లైసెన్స్ ఉన్న వ్యాపారుల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, తప్పని సరిగా రసీదులు తీసుకోవాలని అన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

దమ్మపేట: జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని మొద్దులగూడెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మొద్దులగూడెం గ్రామానికి చెందిన మల్కాపురం సత్యనారాయణ (24) ఏ పనీ చేయకుండా ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. ఏదైనా పని చూసుకోవాలని అతడి తల్లి రుక్మిణి సోమవారం మందలించింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన సత్యనారాయణ క్షణికావేశంలో గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు సత్తుపల్లి ఆస్పత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, ఖమ్మంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్సై యయాతిరాజు కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా పోలవరం నుంచి అనుమతి లేకుండా అక్రమంగా అశ్వారావుపేటకు ఇసుక తరలిస్తుండగా స్థానిక రింగ్‌రోడ్డు వద్ద పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో అనుమతి లేనట్లు గుర్తించామని, ఈ మేరకు ఏలూరు జిల్లా తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామానికి చెందిన డ్రైవర్ చదలవాడ కిషోర్‌పై కేసు నమోదు చేసి, లారీని సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కనిపించని మావోయిస్టుల బంద్ ప్రభావం



దుమ్ముగూడెం మండలం బైరాగులపాడులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

దుమ్ముగూడెం/చర్ల: మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా తలపెట్టిన భారత్ బంద్ ప్రభావం దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో కనిపించలేదు. దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా నడిచాయి. ఆటోలు, బస్సులు మామూలుగానే నడిచాయి. పోలీసులు మాత్రం అప్రమత్తమై ప్రధాన రహదారుల వెంట ముమ్మర తనిఖీలు చేపట్టారు. చర్ల మండలంలో ముందస్తుగా కట్టడి చేసి బంద్‌లో ఎవరూ పాల్గొనకుండా చర్యలు చేపట్టారు. దుమ్ముగూడెంలో సీఐ అశోక్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టి అనుమానితుల వివరాలను అడిగి వదిలేశారు. సరిహద్దు గ్రామాల్లో ప్రత్యేక బలగాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

అట్రాసిటీ కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఓ యువతి.. శివకృష్ణ అనే ఆటో డ్రైవర్ తనను ప్రేమించి పెళ్లి చేసుకుని కొంతకాలం తర్వాత పట్టించుకోవడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో శివకృష్ణతో పాటు ఆయన తల్లి జ్యోతి, మేనమామ వెంకన్నపై ఇల్లెందు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. మరిపెడ బంగ్లాకు చెందిన శివకృష్ణ ఇల్లెందులో ఆటో నడుపుకుంటూ యువతితో పరిచయం పెంచుకుని ప్రేమించి పెళ్లి చేసుకుని ఆ తర్వాత కట్నం కోసం వదిలేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు.

దాడి ఘటనపై..

ఇల్లెందు: పట్టణంలోని 14 నంబర్ బస్తీకి చెందిన సాయి కిరణ్ అనే యువకుడిని అదే బస్తీకి చెందిన దినకరన్ అనే యువకుడు ఓసీ సమీపంలో దాడి చేసి గాయపర్చిన ఘటనపై ఎస్ఐ శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు. 14 నెంబర్ బస్తీలో ఓ ఫంక్షన్ వద్ద మంగళవారం ఘర్షణ జరిగింది. దీంతో సాయి కిరణ్‌ను దినకరణ్ తన బైక్‌పై హమాలీ బస్తీ ఓసీ సమీపంలోకి తీసుకెళ్లి దాడి చేశాడు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

చంద్రుగొండ: వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు చోరీకి గురైన ఘటన మంగళవారం తెల్లవారు జామున మండలంలోని బెండాలపాడులో జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు బండి జోగయ్య, రాధమ్మ ఇంటి ఆవరణలోని రేకుల షెడ్డులో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి రాధమ్మ మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసును బలవంతంగా లాక్కెళ్లాడు. దంపతులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి వెదికినా అప్పటికే దుండగుడు పారిపోయాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ శివరామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో సంచలనం సృష్టించిన కణితి సతీష్ హత్య కేసులో నిందితుడు గుంజ సాయిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న భద్రాచలం ఏఎస్ఆర్ కాలనీకి చెందిన కణితి సతీష్ అనే ఆటో డ్రైవర్‌ను పాత కక్షలతో గుంజ సాయి మరికొందరితో కలిసి దారుణంగా హతమార్చాడు. దీనిపై సతీష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి, మూడు బృందాలుగా ఏర్పడి గాలించామని, సతీష్ హత్యలో ప్రధాన నిందితుడిగా ఉన్న గుంజ సాయిని అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివనాయక్ ముందు హాజరు పరుచనున్నామని తెలిపారు. కాగా పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని, త్వరలోనే నిందితులందరినీ పట్టుకుంటామని ఏఎస్పీ వెల్లడించారు.

వలస కూలీ ఆత్మహత్య

జూలూరుపాడు: మండలంలోని పడమట నర్సాపురం గ్రామానికి చెందిన ఓ రైతు ఆయిల్ పామ్ క్షేత్రంలో పని చేస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వరరావు తెలిపిన వివరాలిల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన నీరజ్ రఘువంశీ(21), ఆల్పా రఘువంశీ దంపతులు కూలీ పనుల కోసం పది రోజుల క్రితం పడమట నర్సాపురానికి వచ్చారు. రైతు చలపతిరావు ఆయిల్ పామ్ తోటలో కూలీ పనులు చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి నీరజ్ అతిగా మద్యం తాగి ఇంటికి రాగా, భార్య ప్రశ్నించడంతో ఆమెతో గొడవపడ్డాడు. కోపంతో భార్య ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోగా, మనస్తాపానికి గురైన నీరజ్ చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం భార్య ఇంటికి వచ్చేసరికి నీరజ్ ఫ్యాన్‌కు వేలాడుతుండగా చుట్టు పక్కల వారి సాయంతో మృతదేహాన్ని కిందకు దింపింది. ఆల్పా రఘువంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాజేశ్వరరావు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి..

చంద్రుగొండ: భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటియాతండాకు చెందిన మధుసూదన్‌రావు(28)కు ఓ యువతితో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్ని నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండగా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మద్యానికి మధుసూదన్‌రావు మనస్తాపానికి గురై సోమవారం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి రామచంద్రు ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక వృద్ధురాలు..

టేకులపల్లి: కడుపునొప్పి తాళలేక వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని దాసుతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దాసుతండాకు చెందిన గుగులోత్ శాంతి(74) ఆరు నెలలుగా కడుపు నొప్పితో ఇబ్బంది పడుతోంది. కుమారుడు ఆమెకు పలుమార్లు వైద్యం చేయించినా నొప్పి తగ్గలేదు. ఈ క్రమంలో సోమవారం కడుపు నొప్పి విపరీతంగా రావడంతో తట్టుకోలేక పురుగు మందు తాగింది. కుటుంబసభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. శాంతి కుమారుడు సైదులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గోదావరిలో మృతదేహం లభ్యం



మైపా యేసోబు (ఫైల్)

మణుగూరు టౌన్: పాత మణుగూరు పరిధిలోని మల్లేపల్లి వద్ద గోదావరి నదిలో ఓ మృతదేహం లభ్యమైంది. స్థానికు ల కథనం ప్రకారం.. పినపాక మండలం తోగ్గూడెం గ్రామానికి చెందిన మైపా యేసోబు(42)కు చెందిన ద్విచక్ర వాహనాన్ని రెండు రోజుల క్రితం నది సమీపంలో గుర్తించారు. బైక్‌ను ఎవరైనా అపహరించి అక్కడికి తీసుకొచ్చారని భావించారు. అయితే మంగళవారం ఉదయం గోదావరిలో మృతదేహం కనిపించగా పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని వెలికితీయగా యేసోబుగా గుర్తించారు. మృతుడు పినపాకలో చర్చి పాస్టర్‌గా, జీఎస్ఎస్ క్రైస్తవ సంస్థ ఏర్పాటు చేసిన ఓ సెంటర్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. యేసోబుకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే యేసోబు మృతికి గల కారణాలు తెలియ రాలేదు.

రైల్వే ట్రాక్ పనులు అడ్డగింత



పనులు చేపట్టొద్దంటూ నినదిస్తున్న గాంధీనగర్ వాసులు

మణుగూరు టౌన్: ఒకవైపు సింగరేణి గుట్టలు, మరోవైపు బీటీపీఎస్ బొగ్గు తరలించేందుకు రైల్వే ట్రాక్ మధ్యలో తామెలా ఉండాలంటూ గాంధీనగర్ వాసులు మంగళవారం రైల్వే ట్రాక్ పనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతేడాది వచ్చిన వరదతో ఆర్థికంగా నష్టపోయామని, సింగరేణి నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితో వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఇప్పుడు రైల్వే లైన్ కట్ట నిర్మిస్తే వర్షాలు కురియగానే ఊరు మునిగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందారు. ప్రభుత్వం స్పందించి తమను సురక్షితమైన ప్రాంతానికి తరలించాలని కోరారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అద్దంకి నరేష్ అక్కడికి చేరుకుని సమస్య పరిష్కారానికి కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు గాంధీనగర్ వాసులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు నగేశ్, మల్లికాంబ, నక్కా వెంకటేశ్వర్లు, కుమారస్వామి, కారం వెంకటేశ్వర్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు



మల్లారం శివారులో అక్రమంగా మట్టి తవ్విన ప్రాంతం,



నిల్వ చేసిన మట్టి

దమ్మపేట: ఎలాంటి అనుమతి లేకుండా జేసీబీతో అక్రమంగా మట్టి తవ్విన దళారులు యథేచ్ఛగా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. మండలంలోని మల్లారం గ్రామ శివారులో సోమవారం రాత్రి ఇలా తరలించిన దళారులు.. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తామే చూసుకుంటామని హామీ ఇచ్చి, ఇటుకబట్టీలకు తరలించినట్లు సమాచారం. గత మూడు రోజులుగా ఇలా అడ్డూ అదుపు లేకుండా మట్టి తరలిస్తున్నారని, ట్రాక్టర్ల అతివేగంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడిన వారిపై, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ భగవాన్ రెడ్డిని వివరణ కోరగా.. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన ప్రాంతానికి ఆర్ఐని పంపి విచారణ చేయిస్తామని చెప్పారు.

గంజాయి కేసులో మరో ఎనిమిది మంది అరెస్టు

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న కేసులో పరారైన ఎనిమిది మందిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ పింగళి నాగరాజు రెడ్డి, ఎస్సై యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేటలో గతనెల 8వ తేదీన వాహనాలు తనిఖీచేస్తుండగా అనుమానంగా కని పించిన ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2.75 లక్షల విలువైన ఐదున్నర కేజీల గంజాయి, మూడ్ బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా అశ్వారావుపేటకు చెందిన తుపాకులనరసింహారావు అలియాస్ విష్ణు, రమేష్, గతాల రాకేష్, పమ్మిడి మణికంఠ, ముళ్లగిరి రమేష్, అనిల్, ఎస్.ఇర్షాద్, మస్తాన్ వలీ అనే వ్యక్తులకు కూడా సంబంధం ఉందని తేలింది. ఈ మేరకు నిందితులను గుర్తించి మంగళవారం అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

ఆరేళ్ల బాలికతో వృద్ధుడి అసభ్య ప్రవర్తన

కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు

పాల్వంచరూరల్: కామంతో కళ్లు మూసుకపోయిన 60 సంవత్సరాల వృద్ధుడు సభ్య సమాజం సిగ్గుపడేలా ప్రవర్తించాడు. ఆరేళ్ల బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన పాల్వంచ మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఓ గ్రామంలో వరుసకు తాత అయిన వీరయ్య ఇంటికి వెళ్లి ఆడుకుంటున్న బాలికతో మంగళవారం వృద్ధుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక రోది స్తూ ఇంటికెళ్లి తల్లిదండ్రులకు చెప్పగా వారు వృద్ధుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తల్లి దండ్రుల ఫిర్యాదు మేరకు వృద్ధుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటరూరల్: పోక్సో కేసులో నిందితుడిని మంగళవారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై యయాతిరాజు కథనం ప్రకారం.. మండలంలోని మారుమూల గ్రామానికి చెందిన మడకం సిరమయ్య అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన బాలికపై తొమ్మిది నెలల క్రితం లైంగిక దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. కాగా, బాలిక గర్భవతి కావడంతో పురిటి నొప్పులు రాగా, తల్లిదండ్రులు గత నెల 31న రాత్రి అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటన వెలుగులోకి రాగా, అదేరోజు రాత్రి బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడైన సిరమయ్యను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. దీంతో న్యాయస్థానం నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.